

ఆదిపురుషుడితడే!

వెలుగూ, వెన్నెలా మాత్రమే కాదు.. సకల జీవకోటికీ ప్రాణప్రదాతలు సూర్యచంద్రులు. ఆ ఇద్దరూ శ్రీనివాసుడిని మోసి, మాడవీధుల్లో తిప్పి పునీతులయ్యారు. బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజున ఉదయం సూర్యప్రభవాహనంపై వజ్రఖచిత శంకు చక్రాలు ధరించిన బద్రీనారాయణుడి రూపంలో స్వామి భక్తులను కటాక్షించాడు. రాత్రి దర్బారు కృష్ణుడి రూపంలో శ్రీనివాసుడు చంద్రప్రభపై ఊరేగాడు. ఈ వేడుకల్లో బిహూ, గురియో, దాండియా నృత్యాలు గురువారం విశేషంగా ఆకట్టుకున్నాయి.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

రతన్ టాటా బహుముఖ సేవలు

● తొమ్మిదేళ్లుగా టీటీడీకి ఉచిత సాంకేతిక సేవ

తిరుమల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, వైద్య, ఉపాధి రంగాల్లో విలువైన సేవలందించడం ద్వారా టాటా ట్రస్టుల ఛైర్మన్ రతన్ టాటా జిల్లాపై చెరగని ముద్ర వేశారు. శ్రీవారికి పరమభక్తుడైన రతన్ టాటా 2010 వరకు క్రమం తప్పకుండా ఏటా తిరుమలకు వచ్చేవారు. వయోభారం కారణంగా ఆ తర్వాత రావడం తగ్గించారు. 2018 జనవరి 8వ తేదీన శ్రీవారిని దర్శించుకుని వెళ్లారు. మళ్లీ అదే ఏడాది ఆగస్టు 31వ తేదీన తిరుపతిలో టాటా కాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి శంఖుస్థాన చేసేందుకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. అదే ఆయన తిరుమలకు రావడం చివరిసారి. తమ టీసీఎస్ సంస్థ ద్వారా టీటీడీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాన్ని పటిష్టం చేసి దేవస్థానం అందించే సేవలను, కార్యకలాపాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులకు చేరవేయడంలో కీలకపాత్ర పోషించారు.2015నుంచీ భక్తుల సౌకర్యాల కల్పనకు ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు, సర్వర్ల మెయింటెన్స్, వివిధ రకాల నెట్‌వర్క్ సర్వీసెస్‌తో సేవలను టీసీఎస్ అందించడం ప్రారంభించింది. భక్తుల సౌకర్యాలను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు పాలనావ్యవస్థల్లోనూ ఐటీ పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టి మెరుగైన సేవలు అందిస్తూ వస్తోంది. ఆర్జితసేవలు, రూ.300టిక్కెట్లు, వసతి, విరాళాల సేకరణ, కల్యాణవేదిక, ఈ-హుండీ, ఈ-పబ్లికేషన్ వంటి ఆన్‌లైన్ సర్వీసులతో పాటు ఆఫ్‌లైన్‌లో గదుల కేటాయింపు, స్లాటెడ్ సర్వదర్శనం, దివ్యదర్శన టోకెన్ల కేటాయింపు, అంగప్రదక్షిణ, వృద్ధులు-దివ్యాంగుల దర్శన టికెట్ల కేటాయింపు, ప్రసాదాలు విక్రయాలు, కల్యాణవేదిక, హెల్త్, ఎడ్యుకేషన్ వంటి విభాగాల్లో సర్వీసులను అందజేస్తోంది.ఆలయాల నిర్వహణలో డిజిటల్ పిలిగ్రిమ్ సెంటర్‌గా టీటీడీని దేశంలోనే మొదటి స్థానంలోకి తీసుకురావడంతో టీసీఎస్ కీలకపాత్ర పోషించింది. ముఖ్యంగా ఈఆర్‌పీ(ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్)ను తీసుకురావడంలో విశేష కృషి చేసింది. టీటీడీకి 'తిరుపతిబాలాజీ.ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్‌ను కూడా టీసీఎస్ అభివృద్ధి చేసింది. పరిపాలనా వ్యవస్థలో మొత్తం టీసీఎస్ ద్వారానే ఈఫైలింగ్ విధానాన్ని తీసుకువచ్చారు. ఇలా ఏడాదికి సుమారు రూ.6 కోట్ల వ్యయంతో దాదాపు వంద మంది సిబ్బందితో గత తొమ్మిదేళ్ళుగా టాటా సంస్థ టీసీఎస్ శ్రీవారికి ఉచిత సేవలను అందిస్తోంది.



2018 జనవరి 8వ తేదీన శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి టాటా మొక్కులు

క్యాన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య సేవలు

ఆర్థిక స్తోమత లేని క్యాన్సర్ పేషెంట్లకోసం టాటా ట్రస్టు టీటీడీ భాగస్వామ్యంతో తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చి పేరిట రూ. 600 కోట్ల భారీ వ్యయంతో ఆస్పత్రి ఏర్పాటు చేసింది. తిరుపతిలోని ఎస్వీ జూపార్క్‌కు వెళ్లే మార్గంలో 25 ఎకరాల భూమిని టీటీడీ లీజు ప్రాతిపదికపై కేటాయించింది. 2018 ఆగస్టు 31వ తేదీన రతన్ టాటా ఈ ఆస్పత్రి నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. వంద పడకలతో నిర్మించిన ఆ ఆస్పత్రిలో తొలిగా 2019 జనవరి 26 'కీమో బ్లాక్ డే కేర్ సెంటర్'ను ప్రారంభించారు. 2022 మే 5న అధికారంగా ఆస్పత్రి ప్రారంభించి వైద్య సేవలు మొదలుపెట్టారు. ప్రస్తుతం ఇందులో రేడియేషన్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, అనస్తీషియా వంటి ఆరు విభాగాలున్నాయి. వీటితో పాటు లేబరేటరీ, పాలియేటివ్ మెడిసన్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.టాటా ట్రస్టు పింక్ బస్సు ఏర్పాటు చేసి చుట్టుపక్కల ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

టాటా స్మార్ట్‌ఫుడ్స్‌తో యువతకు ఉపాధి



శ్రీసిటీలోని టాటా స్మార్ట్‌ఫుడ్స్

దేశంలో రెడీ టు ఈట్ (ఆర్‌టీఈ) మార్కెట్‌లో రెండవ అతిపెద్ద సంస్థగా పేరున్న టాటా స్మార్ట్ ఫుడ్స్ లిమిటెడ్ (టీఎస్ఎల్ఎఫ్) పరిశ్రమను రతన్ టాటా శ్రీసిటీలో ఏర్పాటు చేశారు. 2019 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పరిశ్రమ వల్ల వెయ్యిమంది స్థానికులకు ఉపాధి లభిస్తోంది. మైక్రోవేవ్ సహాయక థర్మల్ స్టెరిలైజేషన్ సాంకేతికతను ఉపయోగించి టాటా స్మార్ట్ ఫుడ్స్ పరిశ్రమ వివిధ రకాల వినూత్నమైన, విభిన్నమైన ఆహార ఉత్పత్తులను తయారు చేస్తోంది. 'టాటా క్యూ' బ్రాండ్‌కింద విక్రయించే పాస్తా, నూడుల్స్ బిర్యానీ, కాంబోమీల్స్ తదితర ఉత్పత్తులు రుచికరంగానూ, పోషక విలువలనూ కలిగి వుంటాయనే పేరుంది.అలాగే టాటా స్మార్ట్ ఫుడ్స్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో జిల్లాలోని పలు అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసింది.కాగా శ్రీసిటీలో ప్రముఖ ఆర్థికవేత్తలు, పారిశ్రామికవేత్తల సహకారంతో 2018లో ఏర్పాటైన క్రియా యూనివర్శిటీకి రతన్ టాటా గౌరవ సలహాదారుగా వ్యవహరించారు.

- సత్యవేడు



శ్రీసిటీలో రతన్ టాటా (ఫైల్‌ఫోటో)






నృత్య ప్రదర్శనలతో భక్తి నీరాజనం





సూర్య, చంద్రప్రభ వాహన సేవల్లో సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఉదయం సూర్యప్రభ వాహన సేవలో వర్షాన్ని లెక్కచేయకుండా 405 మంది కళాకారులు తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బోయ బృందం(అసోం) బిహు, రాహుల్ హెగ్డే బృందం(పంజాబ్) గురియో, విజయ బృందం(విశాఖపట్నం) దాండియా నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థుల భరతనాట్యం, కూచిపూడితోపాటు పలు రాష్ట్రాల కళాకారులు నిర్వహించిన శ్రీరామ విజయం, ఆదిత్య నమనం, శింబు నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాగలక్ష్మి బృందం(రాజమండ్రి)డప్పు వాయిద్యాలు భక్తులను మైమరిపించాయి. రాత్రి చంద్రప్రభ వాహనసేవలోనూ కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి










నేడే శ్రీవారికి మహారథోత్సవం



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు మహారథోత్సవం ప్రారంభం కానుంది. దాదాపు 600 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మహా రథం (చెక్కతేరు)పై శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి కొలువుదీరి భక్తకోటిని కటాక్షించనున్నారు. ఈ ఉత్సవం కోసం వేకువ జామున ఆలయం నుంచి ఉత్సవర్లను ఊరేగింపుగా రథం వద్దకు తీసుకురానున్నారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవర్లను ఆశీనులుచేసి పుణ్యాహవచనం, నవగ్రహారాధన, నవగ్రహదానం చేస్తారు. అనంతరం రథంపై ఉత్సవర్లను అధిష్ఠింపచేసి ఉదయం 7 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. ఇంజనీర్లు రథం బ్రేకులు పరిశీలించి, చక్రాల ఇరుసులకు గ్రీసువేసి తనిఖీ చేశారు. అరటన్ను పుష్పాలతో రథాన్ని అలంకరించారు. మహారథం ఎక్కువ బరువు, భారీగా పరిమాణంలో ఉన్న క్రమంలో మాడవీధుల్లో తిప్పడానికి టీటీడీ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులను భాగస్వాములను చేస్తారు. రథం ముందుభాగంలో ఇరువైపుల పొడవాటి, బలమైన తాడును వందల సంఖ్యలో భక్తులు లాగుతారు. రథం చక్రాల సమీపానికి భక్తులను రానీయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు.

బంగారు గొడుగు ఉత్సవం


అదనపు ఈవోకు గొడుగు అందజేత

మహారథోత్సవం నేపథ్యంలో ముందురోజైన గురువారం సాయంత్రం బంగారు గొడుగు ఉత్సవం జరిగింది. సంప్రదాయం ప్రకారం కల్యాణకట్ట సిబ్బంది ఆధ్వర్యంలో రథోత్సవానికి ముందు రోజు నూతన చత్రస్థాపన్ని చేస్తారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ప్రధాన కల్యాణకట్టలో బంగారు గొడుగుకు పూజలు చేసి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అప్పగించారు. అదనపు ఈవో మాట్లాడుతూ.. తిరుమలలో తొలుత మంగల కట్ట(కల్యాణకట్ట)ను ఏర్పాటు చేసి యాత్రికులకు తలనీలాలు సమర్పించుకునే వసతి కల్పించిన పంతులు గారి వంశస్తులు శ్రీవారి రథానికి గొడుగు సమర్పించడం ఆచారంగా వస్తోందన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో మొదలై.. మహంతుల పాలనలోనూ సాగిందన్నారు. 1946లో పంతులు గారి వంశస్థులైన ధర్మకర్త శివరామయ్య, టీటీడీ మధ్య జరిగిన ఒప్పందం మేరకు కల్యాణకట్టను టీటీడీకి అప్పగించారన్నారు ఆ సందర్భంగా జరిగిన ఒప్పందం మేరకు బ్రహ్మోత్సవాలలో రథోత్సవానికి పంతులుగారి వంశస్తులు గొడుగు ఇస్తున్నారన్నారు. ఇలా ఆ వంశస్తుడైన రామనాథన్ 40 ఏళ్లుగా బంగారు గొడుగుకు పూజలు చేసి ఇస్తున్నట్లు చెప్పారు.


రథంపై గొడుగును అమర్చుతున్న సిబ్బంది

ఆలయంలో అలంకరణకు రూ.15 లక్షల పుష్పాల వితరణ



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోసారి ఆలయంలో అలంకరణకు క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ రూ.15 లక్షల పుష్పాలను విరాళంగా ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు అలంకరించిన పుష్పాలు వాడిపోతాయి కాబట్టి వాటిని గరుడసేవ ముందు రోజు తీసివేసి రెండోసారి పుష్పాలంకరణ చేస్తారు. మళ్లీ మహారథోత్సవం ముందు వాటిని తొలగించి మూడోసారి పుష్పాలంకరణ చేపట్టడం ఆనవాయితీ.ఈ మూడో విడత పుష్పాలంకరణకు 4 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్‌ఫ్లవర్స్‌ను వీవీఎస్ లక్ష్మణ్ అందజేశారు. కాగా, గురువారం రాత్రి జరిగిన చంద్రప్రభ వాహన సేవలో వీవీఎస్ లక్ష్మణ్ పాల్గొని ఉత్సవర్లను దర్శించుకున్నారు.

నేటితో ముగియనున్న వాహనసేవలు

ఈనెల 4న ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం, రాత్రి దేవేరులతో కలిసి శ్రీవారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తున్నారు. శుక్రవారం ఉదయం జరిగే మహా రథోత్సవం, రాత్రి అశ్వవాహనంతో వాహనసేవలు ముగియనున్నాయి. శనివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో గోవిందుడి సాలకట్ల బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

'నాడు- నేడు' ఫొటోలతో దివ్యానుభూతి

కల్యాణవేదికలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ భక్తులను ఆకట్టుకుంటోంది. నాటి తిరుమల అందాలను చూస్తూ సంభ్రమాశ్చర్యాలు పొందుతున్నారు. బ్రహ్మోత్సవాలలో కొన్నేళ్లుగా టీటీడీ ప్రజాసంబంధాల విభాగం ఫొటో ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తోంది. ఇందులో 'నాడు-నేడు' కాన్సెప్ట్‌తో మూడు గ్యాలరీల్లో దాదాపు 50 పురాతన ఫొటోలను.. వాటి కింద ఇప్పటి ఫొటోలనూ ఏర్పాటుచేశారు. నాడు.. నేటి పరిస్థితుల్లో వచ్చిన అనూహ్య మార్పులను ఈ ఫొటోల ద్వారా భక్తులు వీక్షిస్తున్నారు. 1933లో టీటీడీ ఏర్పాటైన తర్వాత 1950 నుంచి బస్టాండ్, అలిపిరి నుంచి తిరుమల కొండలు, గాలిగోపురం, ఘాట్‌రోడ్లు, జీఎన్సీ టోల్‌గేట్, కల్యాణకట్ట, ఇళ్ల మధ్య క్యూలైన్లు, మహద్వారం వద్ద పలుచటి క్యూలైన్, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, గోశాల తదితర ఫొటోలున్నాయి. తాజాగా తీసిన ప్రకృతి అందాలు, తిరుమల అభివృద్ధి వంటి విశేషాలు తెలిపేలా మరో 50 ఫొటోలనూ ప్రదర్శించారు. దాదాపు లక్ష మంది భక్తులు ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.


ఎగ్జిబిషన్ తిలకిస్తున్న భక్తులు

నాడు కాలినడకన తిరుమల కొండపైకి ఇలా..




గాలిగోపురం (నాడు-నేడు)



వెలుగుల తిరుమల

బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.2.20 కోట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలతో తిరుమల వెలిగిపోతోంది. వంద మందికిపైగా టీటీడీ విద్యుత్ శాఖ సిబ్బంది నెల రోజులకుపైగా శ్రమించారు. శ్రీవారి ఆలయ ప్రాకారాలు, మహాద్వార గోపురం, మాడవీధులు, ముఖ్యమైన కూడళ్లు, ఆర్చీలు.. లక్ష్మీ వేంకటేశ్వర, సీతారాములు, శ్రీరామ పట్టాభిషేకం, మహావిష్ణు, విశ్వరూపం, దశావతారం వంటి రూపాలను విద్యుత్తు దీపాలతో తీర్చిదిద్దారు. జీఎన్‌సీతో పాటు పలు పార్కుల్లో దేవతా రూపాలతో ప్రత్యేక ఎలక్ట్రిక్ కటౌట్లు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.



చక్రస్నానం ఏర్పాట్ల పరిశీలన

బ్రహ్మోత్సవాల్లో చివరి ప్రధాన ఘట్టమైన చక్రస్నానం శనివారం ఉదయం జరగనుంది. ఈక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి గురువారం శ్రీవారి పుష్కరిణి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ప్రవేశమార్గాల గురించి తెలుసుకున్నారు. భక్తులకు అసౌకర్యం లేకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది, శ్రీవారి సేవకులను సమన్వయం చేసుకుని చక్రస్నానం సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో శ్రీధర్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో రోజంతా చక్రస్నాన పవిత్రత

'చక్రస్నాన పవిత్రత శనివారం రోజంతా పుష్కరిణిలో ఉంటుంది. భక్తులు సంయమనం పాటించి పుష్కరిణిలో స్నానం చేయాలి' అని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. చక్రస్నానం ఏర్పాట్లపై గురువారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవనంలో అధికారులతో సమీక్షించారు. పుష్కరిణిలో ఏర్పాటు చేసిన గ్యాలరీలు, స్నానఘట్టాలపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీ భద్రతా సిబ్బందితో పాటు ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 2589 దరఖాస్తులు

● నేటితో ఆఖరు గడువు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10: జిల్లాలోని 227 మద్యం దుకాణాలకు గాను గురువారం వరకు 2589 దరఖాస్తులు దాఖలయ్యాయి. అత్యధికంగా తిరుపతి అర్బన్ పరిధిలో 32 దుకాణాలకు 697.. అత్యల్పంగా నాయుడపేటలో 17 షాపులకు 143 దరఖాస్తులు వచ్చాయి. ఇక, తిరుపతి రూరల్ నుంచి 22 దుకాణాలకు 418, గూడూరులో 18 షాపులకు 149 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా అందినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుల దాఖలుకు చివరి రోజైన శుక్రవారం అధిక సంఖ్యలో టెండర్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించం



తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 10: ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టంచేశారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెళ్లకూరు మండలంలోని దిగువ కలవకూరు, పుల్లూరు వద్ద, కోట మండలం గూడలికోట వద్ద ఇసుక అందుబాటులో ఉందన్నారు. డిస్టిలేషన్ పాయింట్ నుంచి ఇసుక తోడటానికి, రవాణాకు ఏజెన్సీని నియమించేందుకు జనవనరులశాఖ త్వరలో చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర పోలీసు గస్తీ, చెక్‌పోస్టు పాయింట్ ఉంటాయన్నారు. ఇసుక వివరాలు, రవాణా తదితర వివరాలను అన్ని సచివాలయాలు, తహసీల్దారు, ఎంపీడీవో, పోలీసు స్టేషన్లలో ఉంచుతామన్నారు. జేసీ శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఆర్వో పెంచల కిషోర్, జిల్లా గనులశాఖ అధికారి బాలాజీనాయక్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, డీటీవో మురళీమోహన్, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో భావి శాస్త్రవేత్తలు మీరే

● అంతరిక్ష వారోత్సవాల ముగింపు సమావేశంలో షార్ డైరెక్టర్


విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట, అక్టోబరు 10: ఇస్రో భావి శాస్త్రవేత్తలు మీరేనని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. గురువారం సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సైన్సు రంగం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకూ అంతరిక్ష విజ్ఞానం చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చెన్నైకి చెందిన ఎస్ఐటీటీ డైరెక్టర్ బాలాజి రామకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసుల రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహమ్మద్, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళులు



తిరుపతి(వైద్యం), అక్టోబరు 10: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాళులు అర్పించారు. తిరుపతిలోని టాటా క్యాన్సర్ హాస్పిటల్‌లో గురువారం సాయంత్రం రతన్ టాటా ఫొటోకు పూలమాల వేసి, ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కొవిడ్ సమయంలో రూ.1500 కోట్లు పీఎం రిలీఫ్‌ఫండ్‌కు విరాళంగా ఇవ్వడమే కాకుండా విద్య, వైద్యం, స్టార్టప్‌లకు ఇతోధిక సాయం అందించారని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు చొరవతో ఐదేళ్ల క్రితం తిరుపతిలో రూ.250 కోట్లతో టాటా క్యాన్సర్ ఆస్పత్రిని స్థాపించి పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దంపూరి భాస్కర్, డాక్టర్ ప్రశాంతి, మహేష్ యాదవ్, బాబ్జీ, లోకేశ్, లక్ష్మీపతి రాయల్, రమణ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు రిజర్వు విభాగంలో పలువురు డీఎస్పీలకు పదోన్నతి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10: పోలీసు రిజర్వు విభాగంలో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరులో పనిచేస్తున్న ఎస్.ఇలియాజ్ బాషాను అదనపు ఎస్పీగా అనంతపురానికి, తిరుపతి రిజర్వు విభాగంలో పనిచేస్తున్న బి.రమణయ్యను కడపకు, టీటీడీలో విజిలెన్సు విభాగంలో శివానంద కిషోర్‌ను అదనపు ఎస్పీగా చిత్తూరుకు బదిలీ చేశారు. చిత్తూరు రిజర్వులో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న నాగేశ్వరరావును విజయనగరానికి బదిలీ చేశారు. వీరందరూ తక్షణం రిలీవ్ అయి వారికి కేటాయించిన ప్రాంతాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తుడా పరిధిలోకి శెట్టిపల్లి భూములు

● త్వరలో జీవో రానుందన్న కలెక్టర్


మీ సమస్యలను పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్, అక్టోబరు10: శెట్టిపల్లిభూములను త్వరలో తుడాకు బదిలీ చేసేందుకు త్వరలో ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీచేయనుందని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. గురువారం ఉదయం ఆయన జేసీ శుభంబన్సల్, కమిషనర్ మౌర్యతో కలసి శెట్టిపల్లె భూములను పరిశీలించారు. రెవెన్యూ, ల్యాండ్, సర్వే, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో నివాసితులను గుర్తించాలని వీఆర్వోలను ఆదేశించారు. తనను కలిసిన బాధితులతో కలెక్టర్ మాట్లాడుతూ.. జీవో విడుదల కాగానే న్యాయం చేస్తాయని హామీ ఇచ్చారు. రైతులకు, ప్లాట్ల కొనుగోలుదారులకు సైతం న్యాయం చేస్తామన్నారు. ఇక్కడి మట్టిని తరలించేవారిపై క్రిమినల్ కేసులు పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. శెట్టి భూబాధితుల కమిటీ అధ్యక్షులు రాధాకృష్ణ, కార్యదర్శి శీను మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య కొనసాగుతోందని, అధికారులు మారిన ప్రతిసారి ఈ భూముల పరిస్థితిని వివరించాల్సి వస్తోందని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ల్యాండ్ అక్విజేషన్ అధికారిణి సుజన, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డీటీలు అశోక్‌రెడ్డి, కిరణ్‌కుమార్, భూబాధితుల కమిటీ సభ్యులు రాజేంద్ర, ఆవుల సురేష్‌యాదవ్, కృష్ణ, షణ్ముగం, నాదముని, మురుగేష్, నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువతి

● బాధితురాలి తల్లి ఫోనుతో స్పందించిన పోలీసులు

● ఆమె లొకేషన్ గుర్తించి ఆస్పత్రికి తరలింపు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10: 'మా అమ్మాయి ఆత్మహత్యకు యత్నిస్తోంది. కాపాడండి' అంటూ బాధితురాలి తల్లి కంట్రోల్ రూముకు ఫోను చేసి చెప్పగా.. పోలీసులు తక్షణం స్పందించారు. వెంటనే ఆ యువతి లొకేషన్ గుర్తించి కాపాడారు. ఈ ఘటన గురువారం తిరుపతిలో చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన ప్రకారం.. రాయచోటికి చెందిన 21 ఏళ్ల యువతి తిరుపతిలో బీటెక్ చదువుతోంది. ఆమెకు తెలిసిన వారి ద్వారా రాయచోటికి చెందిన ఒక అబ్బాయితో స్నేహం ఏర్పడింది. వీరు కొన్నేళ్లుగా కలసి మెలసి తిరుగుతున్నారు. వీరి మధ్య ఏం జరిగిందో కానీ, బుధవారం సాయంత్రం ఆమె ఎర్రమిట్టలో కాపురమున్న స్నేహితుడు ఇంటికి వెళ్లగా అతడు లేడు. కొన్ని రోజులుగా అతడు కనపడక పోవడం, ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయం చెన్నైలోని ఆమె చెల్లెలికి తెలిసి.. రాయచోటిలోని తల్లికి వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపింది. ఆమె పోలీసు కంట్రోలు రూముకు వాట్సాప్ ద్వారా ఫోన్ చేసి చెప్పారు. అలిపిరి సీఐ రాంకిషోర్ ఆదేశాలతో ఎస్ఐ నాగార్జున రెడ్డి తమ సిబ్బందితో రంగంలోకి దిగారు. ఆత్మహత్మకు యత్నించిన యువతి వివరాలను డీ-మార్టులో పనిచేస్తున్న ఆమె స్నేహితురాలి ద్వారా తెలుసుకున్నారు. బాధితురాలి ఫోను నెంబరు ఆధారంగా లొకేషన్ గుర్తించి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను.. ఎస్ఐ తన ద్విచక్రవాహనంలో తీసుకుని రుయాస్పత్రిలో చేర్పించారు. ఆమె ప్రాణాపాయం నుంచి కోలుకుంది.

అపార్ట్‌మెంట్‌పై పిడుగుపాటు

● త్రుటిలో తప్పిన ప్రమాదం

వాటర్‌ట్యాంక్‌పై పగిలిన ఇటుకలు



రేణిగుంట, అక్టోబరు 10: రేణిగుంటలోని ఓ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడింది. అదృష్టవశాత్తూ పెనుప్రమాదం తప్పింది. బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇదే సమయంలో వసుంధరనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ పైభాగంలోని వాటర్‌ట్యాంక్ చివరలో పిడుగు తాకుతూ కింద ఉన్న కాంపౌండ్‌వాల్‌పై పడింది. దీంతో అక్కడి ఇటుకలు చెల్లాచెదరయ్యాయి. భయాందోళనతో అపార్ట్‌మెంట్‌వాసులు బయటకు వచ్చి చూసి పిడుగుపాటును గుర్తించారు. తహసీల్దారు శ్యామ్, వీఆర్వో సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

టాటాకు నివాళి



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 10: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, సంతాపం తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు గుండాల గోపినాథ్ రెడ్డి, కార్యదర్శి కేఎస్‌రాజ, సలహాదారు కొత్తపల్లి మునిరత్నం, సభ్యులు సుబ్రమణ్యం రెడ్డి, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రతన్ టాటా మానవతావాది

తిరుపతి (జీవకోన): రతన్ టాటా గొప్ప మానవతావాది అని, ఆయన మరణం దేశానికి తీరని లోటని బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో టాటా క్యాన్సర్ ఆస్పత్రిని స్థాపించి వేలాదిమందికి ప్రాణదానం చేసిన ప్రాణదాత అని కొనియాడారు. సామాన్య ప్రజల కోసం రూ.లక్షకే నానో కారును అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వ్యాపార రంగంలో రతన్‌టాటా అడుగులు యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు. భారతరత్న అవార్డుకు ఆయన అన్ని రకాల అర్హుడని తెలిపారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 10 : పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అర్హత కలిగిన విద్యార్థులు తమ కళాశాలల ప్రిన్సిపాల్‌కు తగిన ధృవపత్రాలు అందజేయాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపాళ్లు సంక్షేమ శాఖ ద్వారా జారీ చేసిన దరఖాస్తు, అందుకు సంబంధించిన ధృవపత్రాలను జ్ఞానభూమి పోర్టల్‌లో కళాశాల లాగిన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నేతలు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 10: ఆర్టీసీ అలిపిరి డిపో పరిధిలోని ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా, నగర ప్రధాన కార్యదర్శులు కందారపు మురళి, కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం సీఐటీయూ నాయకులు, కార్మికులు అలిపిరి డిపోకు వెళ్లే మార్గంలో బైఠాయించారు. బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని, రెస్ట్‌రూముల సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మిక చట్టం ప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్‌లు కూడా అమలు కావడంలేదని స్పష్టం చేశారు. ప్రశ్నించిన కార్మికుడిపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ధర్నా విరమించేదిలేదని భీష్మించారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కారిస్తామని ఆర్టీసీ అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఆర్.లక్ష్మి, సుబ్రహ్మణ్యం, బుజ్జి, మునిరాజారెడ్డి, చిన్నబాబు, వాసు, శ్రీరాములు, మురళి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య నీరాజనం



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 10 : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తిరుపతి మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన నృత్య నీరాజనం ఆహూతులను అలరించింది. కంటిమి నేడిదే గరుడా చలపతిని, చూడరమ్మ సతులారా వంటి పలు అన్నమయ్య కీర్తనలకు ఎస్వీ సంగీత నృత్య కళాశాల భరతనాట్యం అధ్యాపకులు హరినాథ్ శిష్యబృందం నృత్యం చేశారు. వేంకటేశ్వరస్వామిగా చిన్నారి లలంతిక నాథ్ ఆకట్టుకున్నాడు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న వారికి టీటీడీ అధికారులు స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

గంగమ్మ ఆలయ మాజీ ఈవో మృతి



సుబ్రమణ్యంకు నివాళులర్పిస్తున్న సుగుణమ్మ, ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మాజీ ఈవో పి.సుబ్రమణ్యం బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, గంగమ్మ ఆలయ మాజీ ఛైర్మన్, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ గురువారం ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ హయాంలో గంగమ్మ ఆలయ ఈవోగా పనిచేసిన సుబ్రమణ్యం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గుర్తుచేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, గంగమ్మ ఆలయ మాజీ డైరెక్టర్ రుషి ఉన్నారు.

చెడుపై విజయమే విజయదశమి



వృద్ధురాలికి చేతికర్ర అందజేస్తున్న రాస్ నిర్వాహకులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 10: విజయానికి చిహ్నంగా జరుపుకునే వేడుకలే విజయదశమని రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం పేర్కొన్నారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో కొర్లగుంటలోని ప్రసన్న భారతి స్కూల్ వద్ద గురువారం ముందస్తు విజయదశమి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన వెంకటరత్నం మాట్లాడుతూ రాక్షసులను సంహరించడానికి దేవతలు సృష్టించిన అమ్మవారే దుర్గాదేవి అని తెలిపారు. అనంతరం పేదలకు చేతికర్రలు, రెండు, మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రసన్న భారతి స్కూల్ ఛైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, రాస్ సభ్యులు వి.నాగరాజు, నాగేశ్వర్, వాణి, రామాంజులు, సీతామహాలక్ష్మి, దేవి, కవిత పాల్గొన్నారు.

నేడు మట్టి-చెట్టు-మనిషి పుస్తకావిష్కరణ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 10: నగరానికి చెందిన టీటీడీ విశ్రాంత అధికారిణి, ప్రముఖ రచయిత్రి డాక్టర్ త్యాగదుర్గం మౌని రచించిన మట్టి-చెట్టు-మనిషి కవితా సంకలనం పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. కరకంబాడి రోడ్డు బ్యాంకు ఎంప్లాయీస్ కాలనీలోని నాయని కృష్ణమూర్తి ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సాకం నాగరాజ, గార్లపాటి దామోదర నాయుడు, వాకా ప్రసాద్, పల్లిపట్టు నాగరాజు, తిరువాయిపాటి రాజగోపాల్, రచయిత మౌని పాల్గొంటారు. సాహితీప్రియులు హాజరుకావచ్చునని నిర్వాహకులు తెలిపారు.

ఎరువుల స్టాక్ వివరాలు ప్రదర్శించాలి

తిరుపతి, అక్టోబర్ 10(ఎం.ఆర్.పల్లి): ఎరువుల కంపెనీల ప్రతినిధులు, హోల్‌సేల్ డీలర్లు స్టాకు వివరాలను ప్రదర్శించాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు ఆదేశించారు. వారితో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఎరువుల వివరాలు జిల్లా వ్యవసాయ కార్యాలయానికి క్రమం తప్పకుండా తెలియజేయాలన్నారు. రబీ సీజన్ 1,01,082 మెట్రిక్ టన్నుల ఎరువులు కావాల్సి ఉందని, ప్రస్తుతం 17,086 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఎరువులు కంపెనీల నుంచి సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

నగల బ్యాగు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10: బస్సులో బంగారు నగల బ్యాగు అపహరణకు గురైంది. బాధితుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన కార్తీక్ నాయక్ బెంగళూరు నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తిరుపతికి వచ్చాడు. స్లీపర్ కోచ్ కావడంతో లగేజి బ్యాగులు సీటు కింద ఉంచి పైన పడుకుని నిద్రించాడు. గురువారం రాత్రి తిరుపతిలో దిగి పరిశీలించగా బ్యాగులు ఉన్నాయి కాని అందులో ఉంచిన నగల సంచి కనిపించలేదు. బస్సు డ్రైవరు, క్లీనర్‌లను అడిగితే తమకు తెలియదని సమాధానమిచ్చారు. చేసేది లేక ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బస్సు సిబ్బందిని విచారిస్తున్నామని, తర్వాత కేసు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాసులు చెప్పారు.

ఆర్టీసీకి గరుడసేవ రాబడి రూ.1.84కోట్లు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 10: శ్రీవారి గరుడసేవ రోజున ఆర్టీసీకి రూ.1.84కోట్లు సమకూరింది. అదే రోజున జిల్లా వ్యాప్తంగా లభించిన రాబడి రూ.2.57కోట్లుగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాబడి సాధించిన ఉద్యోగులు, కార్మికులను ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని ఆకాంక్షించారు.

దుర్గాదేవిగా మూలస్థాన ఎల్లమ్మ



సరస్వతీదేవి అలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ



ఏకాంబరేశ్వరిని దర్శించుకున్న భక్తులు



దుర్గాదేవి అలంకరణలో చాముండేశ్వరీదేవి

తిరుపతి రూరల్, అక్టోబరు 10 : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెంచువారికాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు బిరుదాల కృష్ణారెడ్డి, బిరుదాల సిద్ధారెడ్డి, బిరుదాల హనుమంతరెడ్డి, తులసీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

● **పెరుమాళ్లపల్లె ఏకాంబరేశ్వరి ఆలయంలో** : తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె గ్రామంలోని శ్రీయాకారమ్మ(ఏకాంబరేశ్వరి) ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఆలయ ధర్మకర్త పెద్దమంగారి గుణశేఖర్‌రెడ్డి, గౌతమి దంపతులు పాల్గొన్నారు.

● **చాముండేశ్వరి ఆలయంలో** : తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు అనుగ్రహించారు. అమ్మవారిని తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దంపూరి భాస్కర్‌యాదవ్, రామరాజు, సోమశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, గోవర్ధన్, నరహరిరెడ్డిలు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.



మహిషాసురమర్ధినిగా కామాక్షి అమ్మవారు

దుర్గాదేవిగా గంగమ్మ



దుర్గాదేవిగా గంగమ్మ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 10: తాతయ్యగుంట గంగమ్మ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం దుర్గాదేవి అలంకారంలో ఊంజల సేవ నిర్వహించారు. ఈవో జయకుమార్ పాల్గొన్నారు.

కపిలతీర్థంలో..

కపిలతీర్థం ఆలయంలో ఉదయం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం కామాక్షి అమ్మవారిని మహిషాసురమర్ధినిగా అలంకరించి, ఊంజలసేవ నిర్వహించారు. శుక్రవారం అమ్మవారు సరస్వతిదేవి రూపంలో దర్శనమివ్వనున్నారు.

సరస్వతీదేవిగా అన్నపూర్ణ



సరస్వతీదేవి అలంకరణలో అన్నపూర్ణదేవీ

తిరుపతి అర్బన్, అక్టోబరు 10: లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నివేదన సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సైనిక్, నవోదయ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



తిరుపతి(విద్య), అక్టోబరు 10: వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో గురువారం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల స్టడీ మెటీరియల్స్‌ను ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రామచంద్రారెడ్డి, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులరెడ్డి, వాసుదేవయ్య, రవీంద్రారెడ్డి, భాస్కర్‌రాజు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 8688888802, 92999 76999లను సంప్రదించాలని కోరారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం

ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో వాకథాన్



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 10: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ద్వారా పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తిరుపతి ఆదాయ పన్నుశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునిత బిల్లా అన్నారు. క్లీన్ ఇండియాలో భాగంగా గురువారం ఆదాయ పన్నుశాఖ ఆధ్వర్యంలో నగరంలో వాకథాన్ నిర్వహించారు. ఆదాయ పన్నుశాఖ కార్యాలయం నుంచి వీవీ మహల్ రోడ్డు, పాత మున్సిపల్ ఆఫీసు, తిలక్ రోడ్డు మీదుగా నాలుగు కాళ్ల మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదాయ పన్నుశాఖ అధికారి శివరామకృష్ణ, పరిపాలనాధికారి రవీంద్రకుమార్, పీఆర్ఓ బాలాజీ, ఐటీవోలు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 10 : ప్రస్తుత జీవన పరిస్థితుల్లో ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరముందని స్విమ్స్ సైకియాట్రీ విభాగాధిపతి గణేష్ కుమార్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లో గురువారం సైకియాట్రీ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక ఆరోగ్యం స్థిరంగా ఉన్నప్పుడే శారీరక ఆరోగ్యమూ చక్కగా ఉంటుందన్నారు. వ్యాయామం, యోగాతో మానసికోల్లాసంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులకు మానసిక వ్యాధులు, వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళావత్, వైద్య విభాగాధిపతులు వనజాక్షమ్మ, దుర్గాంజలి పాల్గొన్నారు.

రుయాలో..: రుయాస్పత్రిలో మానసిక విభాగం ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ రవిప్రభు మానసిక వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. మానసిక వ్యాధుల నిర్మూలనకు రుయాస్పత్రిలో చక్కటి వైద్య పద్ధతులు, కౌన్సెలింగ్ పద్ధతులు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్య విభాగాధిపతి మల్లికార్జున్, వైద్యులు భూపాల్ నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం: ఐదుగురి అరెస్టు

రేణిగుంట, అక్టోబరు 10: గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని గాజులమండ్యం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో గంజాయి ముఠా సమాచారం పోలీసులకు అందింది. దీంతో సీఐ మురళీకృష్ణ స్థానిక రైల్వే సంత గేటు వద్ద మాటువేశారు. చెన్నైకు గంజాయి తరలిస్తున్న తమిళనాడుకు చెందిన భార్యాభర్తలు ఏనుమలై, ఈశ్వరి, వారి అనుచరులు రాజేంద్రకుమార్, కరణ్‌రాజ్, మదన్‌కుమార్‌లను గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తక్కువ ధరకే వంటనూనె



వినియోగదారులకు నూనె ప్యాకెట్లు అందజేస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 10 : మార్కెట్ ధరకంటే తక్కువకే వంటనూనె వినియోగదారులకు అందజేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బేరివీధిలోని గోపీకృష్ణ ఆయిల్ స్టోర్‌లో రూ.135 విలువ కలిగిన పామాయిల్‌ను రూ.117కు, రూ.145 విలువ కలిగిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను రూ.128కి గురువారం ఆయన వినియోగదారులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజార్లు, పెద్ద రిటైల్ దుకాణాలలో తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీటీ జయరామ్, ప్రతాప్, దుకాణ యజమాని పాల్గొన్నారు.

జగన్ గుడ్‌బుక్ రచన ఆహ్వానించదగింది

కూటమి ప్రభుత్వ మంచి పనులను రాయాలి ● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 10: మాజీ సీఎం వై.ఎస్.జగన్ గుడ్‌బుక్ రాస్తాననని ప్రకటించడం శుభపరిణామమని, దాన్ని ఆహ్వానిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ గుడ్‌బుక్‌లో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, అభివృద్ధి గురించి మాత్రమే రాసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాకాకపోతే ఆయన ఆత్మకథ, కుటుంబంలో రక్తచరిత్ర, గుండెపోటు - గొడ్డలి పోటు లాంటి విషయాలు రాసుకోవాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. అందుకే నోట్‌బుక్, పెన్నుల ప్యాకెట్ పంపించనున్నట్లు చెప్పారు. జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారిస్తే తమ ప్రభుత్వం అభివృద్ధి ప్రదేశ్‌గా మారుస్తోందని అన్నారు. వరదల కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే వైసీపీ నేతలు సాయం చేయకపోగా బురద రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. వైసీపీ అక్రమాలకు తిరుమల లడ్డూను కూడా ఉపయోగించుకోవడం సిగ్గుచేటన్నారు. వైసీపీ అక్రమాల కారణంగా అధికారులు కష్టాలపాలౌతున్నారన్నారు. ఇప్పటికే ముగ్గురు సస్పెండ్ అయ్యారని, మరికొందరు క్యూలో ఉన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీకి కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా సాయం అందిస్తోందన్నారు. బీజేపీ నాయకులు వరప్రసాద్, డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయిలకు జీవిత ఖైదు

● రూ.10వేలు జరిమానా


శ్రీకాళహస్తి సబ్ జైలు వద్ద ముద్దాయిలతో ఏర్పేడు పోలీసులు

ఏర్పేడు, అక్టోబరు 10: ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామం బాపూజీ స్కూల్ వద్ద 2019లో జరిగిన హత్యకేసుకు సంబంధించి గురువారం శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ ఇద్దరు ముద్దాయిలకు జీవితఖైదు, రూ.10వేలు జరిమానాతో కూడిన తీర్పు వెలువరించినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. 2019లో మర్రిమంద గ్రామానికి చెందిన మునస్వామి(45)ని అదే గ్రామానికి చెందిన తంబి కుమార్‌స్వామి, తంబి గోపాల్‌లు హత్య చేశారని చెప్పారు. ఇంటి స్థలానికి సంబంధించి గొడవల నేపథ్యంలో మునస్వామిని హత్య చేశారని పేర్కొన్నారు. ఈ హత్య విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారన్నారు. వెంటనే చార్జ్‌షీట్ కూడా వేశారని తెలిపారు. పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్ మేరకు శ్రీకాళహస్తి 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి... మునస్వామిని హత్య చేసిన ఇద్దరు ముద్దాయిలకు జీవితఖైదు, రూ.10వేలు జరిమానా విధించారని తెలిపారు. ఈ కేసులో సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుళ్లను, దర్యాప్తు అధికారులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించినట్లు సీఐ తెలిపారు.

దార్శనికుడిని భారతదేశం కోల్పోయింది

- డా. రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు, అక్టోబరు 10: భారతీయ పరిశ్రమ, దాతృత్వానికి మారుపేరైన రతన్ టాటా మరణంతో దేశం దార్శనికుడిని కోల్పోయిందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి గురువారం నివాళి అర్పించారు. 2019 ఏప్రిల్ 16న ఆయన శ్రీసిటీ పర్యటనకు వచ్చిన సందర్భంగా శ్రీసిటీని, అభివృద్ధిని కొనియాడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు శ్రీసిటీకి ఎంతో గౌరవ ప్రదం కలిగించాయని తెలిపారు.

రతన్‌టాటా మరణం దేశానికి తీరని లోటు


రతన్‌టాటాకు నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10: రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పాతబస్టాండు కూడలి వద్ద రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ రతన్‌టాటా వ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన వ్యక్తిగానే కాకుండా దాతృత్వానికి ప్రతీక అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, ఢిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాన్ని ఢీకొని విద్యార్థి మృతి

రేణిగుంట, అక్టోబరు 10: వాహనాన్ని ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుచానూరు బైపాస్‌రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు చెల్లూరు గొల్లకండ్రిగకు చెందిన ఐటీఐ చదువుతున్న విద్యార్థులు ద్విచక్ర వాహనంలో తిరుపతి నుంచి రేణిగుంటకు పని నిమిత్తం రాత్రి వస్తుండగా టయోటా షోరూం వద్ద కడపకు చెందిన ప్రవీణ్‌కుమార్ తన వాహనాన్ని ఒక్కసారిగా రోడ్డుపై యూటర్న్ తీసుకోవడంతో వెనుక వస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి వేగంగా ఢీకొంది. ఈ క్రమంలో వెనుక కూర్చున్న జస్వంత్(19)కు తీవ్ర గాయాలు కాగా, మునికుమార్ స్వల్పంగా గాయపడ్డాడు. వీరిని పోలీసులు చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో జస్వంత్ మృతి చెందాడు. గాజుల మండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌పై పిడుగుపాటు

● తృటిలో తప్పిన పెనుప్రమాదం


వాటర్‌ట్యాంక్‌పై పిడుగు పడటంతో పగిలిపోయిన ఇటుకరాళ్లు

రేణిగుంట, అక్టోబరు 10: రేణిగుంట పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపాటుతో తృటిలో పెనుప్రమాదం తప్పిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే బుధవారం మధ్యాహ్నం రేణిగుంటలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సందర్భంగా వసుంధర నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ పైభాగంలోని వాటర్‌ట్యాంక్ చివరలో పిడుగు తాకుతూ కింద ఉన్న కాంపౌండ్‌వాల్‌పై పడింది. దీంతో ఇటుకలు చెల్లాచెదురయ్యాయి. భయాందోళన చెందిన అపార్ట్‌మెంట్ వాసులు బయటకు వచ్చి చూడగా పిడుగుపాటును గుర్తించారు. దీంతో నివాస ప్రాంతాల్లో పిడుగులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు శ్యామ్, వీఆర్వో సుబ్రహ్మణ్యం అక్కడికి చేరుకుని పరిశీలించారు. కలెక్టర్‌కు రిపోర్టు చేశారు.

యుద్ధోన్మాదం వద్దు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10: మారణ హోమానికి కారణమయ్యే యుద్ధాలు వద్దని, ప్రపంచశాంతి కోసం అందరూ ముందడుగు వేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గంధం మణి అన్నారు. ఇజ్రాయెల్, పాలస్తీనా యుద్ధానికి వ్యతిరేకంగా పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

దుర్గాదేవి నమోస్తుతే


దుర్గాదేవిగా నల్లగంగమ్మ


దుర్గాదేవిగా చాముండేశ్వరి







బండాసుర వధ అలంకారంలో జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తి- వనదుర్గగా దక్షిణ కాళికాదేవి - మహాగౌరిగా బొమ్మలకొలువులో అమ్మవారు - మహాదుర్గాదేవిగా కనకదుర్గమ్మ - దుర్గాపరమేశ్వరిగా బజారువీధి కన్యకాపరమేశ్వరి -ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ అమ్మవారు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10: దుర్గాదేవి నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవార్లకు మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఉదయంనుంచే ఆలయాలకు వెళ్లి దీపారాధనలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞాన ప్రసూనాంబిక ఉత్సవమూర్తి అమ్మవారిని బండాసురవధ అలంకారంలో అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి ఆలయంలో రంగులగోపురం వరకు ఊరేగించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఉత్సవమూర్తి అమ్మవారు మహాగౌరీదేవిగా కొలువుదీరారు. ఇదే ఆలయంలో వెలసిన కనకదుర్గమ్మ మహాదుర్గాదేవి అలంకారంలో, కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మను ప్రత్యేకంగా, ఉత్సవమూర్తిని దుర్గాదేవిగా అలంకరించారు. శ్రీకాళహస్తి మండలం వేడాంలో దక్షిణ కాళికాదేవి దుర్గాదేవిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి దుర్గాపరమేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. బంగారమ్మ అమ్మవారు, పానగల్‌లో వెలసిన గంగమ్మ ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి దుర్గాదేవిగా, ముత్యాలమ్మ గుడివీధిలోని ముత్యాలమ్మ ప్రత్యేక భక్తులకు దర్శనమిచ్చారు. బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి ప్రత్యేక అలంకారంలో, తెట్టు ప్రాంతంలోని నల్లగంగమ్మ బీపీ అగ్రహారం పెద్దగంగమ్మ, చిన్న గంగమ్మ, పొన్నాలమ్మ, భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మగుడివీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసల వీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీ రోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు


అంబూరులో సరస్వతీదేవి అలంకారంలో కామాక్షమ్మ - ఖడ్గ త్రిశూల స్వరూపిణిగా అంకాళ పరమేశ్వరి


దుర్గాదేవిగా గుడిమల్లం అమ్మవారు

ఏర్పేడు, అక్టోబరు 10: దుర్గాదేవి పాహిమాం అంటూ భక్తులు అమ్మవారి ఆలయాల వద్ద పోటెత్తారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఏర్పేడు మండలం చిందేపల్లెలో వెలసిన పార్వతీదేవి దుర్గాదేవిగా, గుడిమల్లంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో వెలసిన కామాక్షమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు నందకిషోర్‌రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి అడవికండ్రిగలో కొలువై ఉన్న అంకాళపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ఖడ్గ త్రిశూల స్వరూపిణిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

950 గ్రాముల గంజాయి స్వాధీనం

● చెన్నైకు రవాణా చేస్తున్న ఐదుగురి అరెస్టు

రేణిగుంట, అక్టోబరు 10: చెన్నైకు గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని గాజులమండ్యం పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం ఉదయం సంతగేటు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి చెన్నైలో విక్రయిస్తున్న ఓ ముఠా సమాచారం పోలీసులకు అందింది. ఇందులో భాగంగా గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ స్థానిక రైల్వే సంత గేటు వద్ద చెన్నైకు గంజాయి తరలిస్తున్న తమిళనాడుకు చెందిన భార్యాభర్తలు ఏనుమలై, ఈశ్వరి, వారి అనుచరులు రాజేంద్రకుమార్, కరణ్ రాజ్, మదన్‌కుమార్‌ను అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు గాజులమండ్యం పోలీసులు తెలిపారు.

భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 10: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని శీతాలంబ ఆలయం వద్ద గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శిలాఫలకం, లైట్లు ధ్వంసం


పగులగొట్టిన శిలాఫలకం

కేవీబీపురం, అక్టోబరు 10: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఉన్న మాజీ సీఎం జగన్, ఎంపీపీ ఫొటోలను బుధవారం రాత్రి కొంతమంది వ్యక్తులు తీసివేసి, దానిపై ఉన్న కొన్ని పేర్లను తుడిచివేసి దిమ్మెను పగులగొట్టారు. అలాగే కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విద్యుత్ మెయిన్‌ను, స్విచ్‌బోర్డు, రెండు లైట్లను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు.

రియల్టర్లు ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

అడ్డుకున్న టీడీపీ నేతలు


అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను అడ్డుకున్న టీడీపీ నాయకులు, గ్రామస్థులు

ఏర్పేడు, అక్టోబరు 10: ఏర్పేడు మండలం మన్నసముద్రం చెరువులో తిరుపతికి చెందిన కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మట్టి అక్రమ రవాణాకు పాల్పడ్డారు. రెండు రోజులుగా రాత్రి సమయంలో మన్నసముద్రం చెరువులో నుంచి రేణిగుంటకు తరలిస్తున్నారు. జేసీబీలసాయంతో సుమారు 20 టిప్పర్ల ద్వారా, 500 టిప్పర్ల మట్టిని తరలించినట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి సమాచారం అందుకున్న మన్నసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సదా శంకర్ నాయుడు, వెంకటేష్, తులసీరామ్, మోహన్‌రెడ్డి, సతీష్ తదితరులు వెళ్లి అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్నారు. ఈ విషయంపై రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మన్నసముద్రంలో మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలని అధికారులను గ్రామస్థులు వేడుకున్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10: శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి వద్ద ఉన్న శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (టీచర్ ట్రైనింగ్ కళాశాల)లో 2012-14 డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ అభ్యసించిన ఛాత్రోపాధ్యాయులు పది సంవత్సరాల తరువాత గురువారం కలుసుకున్నారు. కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ తమ కళాశాలలో 2012-14 విద్యాసంవత్సరంలో టీచర్ ట్రైనింగ్ కోర్సును అభ్యసించిన వారు ప్రస్తుతం చాలా మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఈ కళాశాలలో తాము చదవడం వలన మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన వ్యక్తిత్వం అలవడిందన్నారు. నాటి ఫలితమే తాము నేడు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉన్నత స్థాయిలో ఉన్నామన్నారు. అనంతరం కరస్పాండెంట్ మిద్దెల హరి, పూర్వపు ప్రిన్సిపాల్ శ్రీకుమార్‌ను ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు అధ్యాపకులు సత్యనారాయణరావు, అన్వర్‌ఖాన్ బహని, చంద్రశేఖర్, స్కిమ్స్ ప్రిన్సిపాల్ గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

సైనిక్, నవోదయ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



తిరుపతి(విద్య), అక్టోబరు 10: వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో గురువారం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల స్టడీ మెటీరియల్స్‌ను ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రామచంద్రారెడ్డి, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులరెడ్డి, వాసుదేవయ్య, రవీంద్రారెడ్డి, భాస్కర్‌రాజు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 86888 88802, 92999 76999లను సంప్రదించాలని కోరారు.

అంబేద్కర్ పేరు చెప్పి కబ్జాకు యత్నిస్తే సహించేది లేదు

రేణిగుంట, అక్టోబరు 10: అంబేద్కర్ పేరుచెప్పి ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నిస్తే సహించేది లేదని తారకరామానగర్‌కు చెందిన దళిత సంఘాల నేతలు హెచ్చరించారు. గురువారం సాయంత్రం తారకరామానగర్‌లోని కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం రిజర్వ్ చేసిన భూమిని దళిత సంఘం నాయకులు, టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కరకంబాడి క్లస్టర్ ఇన్‌ఛార్జి బుజ్జి నాయుడు, దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ సీపీఐలో ఉంటూ ప్లాట్లను కబ్జాలు చేసి అమ్ముకోవడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న రెడ్డెప్ప అనే వ్యక్తిని ఆ పార్టీనుంచి సస్పెండ్ చేశారని, అయినా తాను సీపీఐ నాయకుడినని చెబుతూ అంబేద్కర్ సంఘం పేరుతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రిజర్వు చేసిన ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారని చెప్పారు. దాడి చేసి కులం పేరుతో దూషించారని దుష్ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్రకు దళితులపై దాడిచేసినవారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని గురువారం దళితసంఘం నాయకులు ఫిర్యాదు చేశారు.

అందరికీ అందుబాటులోకి న్యాయవ్యవస్థ

శ్రీకాళహస్తి, అక్టోబరు 10: రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు ప్రజలందరికీ న్యాయవ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఉచితంగా అందించే న్యాయసేవలపై వెబ్‌సైట్, హెల్ప్‌లైన్ 15100 నెంబరు సూచిక బోర్డులను జనసంచారం ఉండే అన్ని ముఖ్యప్రదేశాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా హెల్ప్‌లైన్ ద్వారా ఉచితంగా న్యాయ సలహాలు, తీసుకోవచ్చన్నారు.

ఎంపీడీవోగా మహ్మద్ రఫీ బాధ్యతల స్వీకరణ

పిచ్చాటూరు, అక్టోబరు 10: పిచ్చాటూరు నూతన ఎంపీడీవోగా మహ్మద్ రఫీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు పదవీ విరమణ చేయడతో సూపరిటెండెంట్‌గా రాధారాణి ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. ఎంపీడీవోగా మహ్మద్ రఫీ ఇక్కడికి రావడంతో ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న రాధారాణి కేవీబీపురం ఇన్‌చార్జి ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

పుత్తూరు వార్తలు

కామాక్షి దేవిగా ద్రౌపదీ అమ్మవారు


కామాక్షి దేవి అలంకరణలో ద్రౌపదీ అమ్మవారు

పుత్తూరు టౌన్: పట్టణంలోని ద్రౌపదీ దేవీ ఆలయంలో అమ్మవారు కామాక్షి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. గీత, పవన్ కుమార్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. కమిటీ ఛైర్మన్ కిష్టప్ప మొదలియార్, సభ్యులు మునిచంద్ర, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

● మున్సిపాలిటీ పరిధిలోని రాచపాళెంలో కొండపై వెలసియున్న లక్ష్మీకనకదుర్గ లక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ఈకార్యక్రమం మాజీ వైస్ ఛైర్మన్ ప్రతాప్ రాజు, ప్రముఖ శల్య వైద్యులు ప్రకాష్ రాజు, జయరామరాజు, క్రిష్ణమరాజు, బాల సుబ్రమణ్యంరాజు ఆధ్వర్యంలో జరిగింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 10: పుత్తూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చోరీల నిరోధనకు సహకరించాలని సీఐ సురేంద్ర నాయుడు గురువారం కోరారు. దసరా సెలవులు, ఇతర కారణాల చేత దూర ప్రయాణాలకు వెళ్లే సమయంలో పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లాలని తెలిపారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ పరిధిలో మీ ఇళ్లు పోలీసుల పర్యవేక్షణలో పదిలంగా ఉంటాయని చెప్పారు. అపరిచితులు, అనుమానితులు సంచరిస్తున్నట్లు అనుమానం కలిగితే వెంటనే 112కు కాల్ చేయాలన్నారు. సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో డీసీ ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న విజయ్ శేఖర్

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 10: పుత్తూరు ఎక్సైజ్ కార్యాలయంలో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన తదితర అంశాల కోసం ప్రత్యేకంగా మూడు కౌంటర్‌లు ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. అనంతరం పుత్తూరు సర్కిల్ ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ... పుత్తూరు సర్కిల్ పరిధిలో 17 మద్యం దుకాణాలకుగాను గురువారం వరకు 128 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించిన విషయాన్ని గుర్తుచేశారు. 14న శిల్పారామంలో లక్కీడిప్ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు ఉదయం 8 గంటలకు తరలిరావాలని సూచించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, ఎస్సైలు అంజాద్‌బాషా, శివప్రసాద్ పాల్గొన్నారు.

రతన్ టాటాకు టీడీపీ నివాళి

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 10: పారిశ్రామిక దిగ్గజం, పద్మవిభూషణ్‌టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్‌బాబు ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం స్థానిక ఎంబీ రోడ్డులోని తన కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవి నాయుడు, పరమేశ్వర మంగళం ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ధనపాల్, నాయకులు దాసరి విజయ్ చౌదరి, అరవ ప్రకాష్, సుబ్రమణ్యం, కిరణ్, సెంగునాథన్, తోటి మణికంఠ పాల్గొన్నారు.


రతన్ టాటా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విజయ్‌బాబు తదితరులు